నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | మార్చి 04, 2025 | www.navatelangana.com

అనుమానాస్పదంగా మహిళ మృతి


పెంచికల్‌పేట్ :అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం..లోడ్డపల్లి గ్రామానికి చెందిన గుర్ల లలిత(35) గ్రామ సమీప పంట పొలంలో మామిడి చెట్టు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం అటుగా వెళ్లిన మృతురాలి అత్త లక్ష్మి మృతదేహాన్ని చూసి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించింది. సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కొమురయ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సాయంతో పరిశీలించారు. కూతురిని అల్లుడు గణేశ్ హత్య చేశాడని మృతురాలి తల్లి తానుబాయి పోలీసులకు తెలిపింది. కొన్ని రోజులుగా అనుమానంతో వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.



వ్యాయామం చేస్తూ గుండెపోటుతో మృతి

నవతెలంగాణ-మంచిర్యాల

రోజువారి లాగే మైదానానికి వెళ్లి వ్యాయామం చేసే క్రమంలో మంచిర్యాలకు చెందిన ఆర్ఎంపీ గుండెపోటుతో మృతి చెందాడు. పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన శ్రీనివాస్(55) సోమవారం ఉదయం బాయ్స్ హైస్కూల్ మైదానంలో ఫిట్నెస్ సెంటర్ సభ్యులతో కలిసి వ్యాయామం చేస్తున్న సమయంలో గుండెపోటు వచ్చింది. శ్రీనివాస్ ఎల్ఐసీ ఏజెంట్, ఆర్ఎంపీ, వ్యాయామ కోచ్‌గా చాలా మందికి సూపరిచితుడు. వ్యాయామం చేసే సమయంలో గుండెపోటు రావడంతో ఒక్కసారిగా మైదానంలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి మిత్రులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు మిత్రులు తెలిపారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కొడుకు, కూతురు ఉన్నారు.



బోర్డులు పెట్టేసి..నిధులు మెక్కేశారు..!

- క్రీడా ప్రాంగణాల పేరిట నిధులు దుబారా
- ఆట స్థలం లేకపోయినా బోర్డులు పాతిన వైనం
- ఎక్కువగా పాఠశాలలు..అనువుగాని చోట్ల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో రూ.లక్షల ప్రజాధనం వృధా

పట్టణవాసులకే కాదు..గ్రామీణులకు కూడా క్రీడా స్థలం ఉండాలి. గ్రామీణవాసులు కూడా జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ఊరూరా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేసింది. ప్రభుత్వం ఉద్దేశ్యం మంచిదే అయినప్పటికీ క్షేత్రస్థాయిలో అది సక్సెస్ కాలేకపోయింది. ఈ ప్రాంగణాలు ఏర్పాటుచేసేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఊరికి దూరంగా అనువుగాని చోట్ల వీటిని ఏర్పాటుచేశారు. దీంతో వీటి ద్వారా ఎవరికి ఉపయోగం లేని పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం ఒకటి, రెండు చోట్ల తప్పితే ఏ ఊరిలో చూసినా వీటి పరిస్థితి దయనీయంగా మారింది. వీటిని ఏర్పాటుచేయడం ద్వారా స్థానిక అప్పటి ప్రజాప్రతినిధులు, పనులు చేపట్టిన గుత్తేదారులకు కాసుల వర్షం కురిపించిందనే ఆరోపణలున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామీణులకు వివిధ క్రీడలను పరిచయం చేయడంతో పాటు ఆటల్లో మెరికలుగా తయారుచేయాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ఊరికో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసింది.ఇందుకు ఉపాధిహామీ నిధులు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు ఆయా పరిమితిని బట్టి కేటాయించింది. అప్పటి ప్రభుత్వం స్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, ప్రకృతివనాలతో పాటు క్రీడా ప్రాంగణాలను కూడా ఏర్పాటుచేసింది. ఈ ప్రాంగణాలకు బోర్డులు పెట్టడంతో పాటు వివిధ ఆటలు ఆడేందుకు పరికరాలు. ఆటవస్తువులు అందుబాటులో ఉంచడం వంటిని చేపట్టాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1512 గ్రామ పంచాయతీల్లోనూ వీటిని ఏర్పాటుచేశారు. చాలా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో అనేక చోట్ల పాఠశాలలనే క్రీడా ప్రాంగణాలుగా మార్చారు. మరికొన్ని చోట్ల అంగన్‌వాడీ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉండే ఖాళీ స్థలంలో వీటిని ఏర్పాటుచేశారు. మరికొన్ని చోట్ల ఊరికి బహుదూరంలో ఎక్కడో అటవీ ప్రాంతానికి ఆనుకొని లేదంటే డంపింగ్‌యార్డుల వద్ద ఈ బోర్డులను ఏర్పాటుచేయడం విమర్శలకు తావిచ్చింది. ఎలాంటి ఆటలకు అవకాశం లేకుండా వీటిని ఏర్పాటుచేయడంతో ప్రభుత్వం ఉద్దేశం పక్కదారి పట్టిందనే విమర్శలున్నాయి.



రూ.లక్షల ప్రజాధనం వృథా..!

అప్పటి ప్రభుత్వం ఏర్పాటుచేసిన వాటిలో వైకుంఠధామాలు, కొన్ని చోట్ల డంపింగ్‌యార్డులు మినహాయిస్తే మిగితా పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. వీటి కోసం వెచ్చించిన ప్రజాధనం వృధాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తాయి. పల్లె ప్రకృతివనాలు సైతం అటవీ ప్రాంతంలో ఏర్పాటుచేయడం..చాలా చోట్ల బోర్డులు పెట్టి..కొన్ని మొక్కలు పెట్టి మమ అనిపించడం కనిపిస్తోంది. చాలా చోట్ల ఆ సమయంలో నాటిన మొక్కలు ప్రస్తుతం కనిపించకుండాపోయాయి. తాజాగా క్రీడా ప్రాంగణాల పరిస్థితి కూడా వీటి మాదిరిగానే మారిందనే ఆరోపణలున్నాయి. ఒక్కో క్రీడా ప్రాంగణానికి ఉపాధి నిధులను రూ.20వేల నుంచి వాటి పరిమాణాన్ని బట్టి రూ.50వేల వరకు కేటాయించినట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.లక్షల్లో నిధులు దుబారా అయ్యాయనే ఆరోపణలున్నాయి.

అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే బిల్లులు మంజూరు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలు అక్కడ క్రీడా ప్రాంగణం ఏర్పాటుచేశారా..?చేస్తే ఎక్కడ ఏర్పాటుచేశారు..ఎంత ఖర్చు చేశారు..?ఇలాంటి వివరాలు ఏమీ తెలుసుకోకుండానే బిల్లులు మంజూరు చేయడం మూలంగా ప్రభుత్వం ఇతర పనుల కోసం ప్రజలకు వెచ్చించాల్సిన నిధులు దుబారా అయ్యాయనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు వీటిపై దృష్టిసారించి క్రీడా ప్రాంగణాల్లో ఉండాల్సిన సౌకర్యాలు ఏర్పాటుచేయించాలని..ప్రభుత్వ నిబంధనల మేరకు వీటిని పున ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నీరందక ఎండుతున్న వరి పొలాలు



నవతెలంగాణ-కడెం

మండలంలోని ఎలగడప, పెత్తార్పు, మాసాయిపేట్, కొత్త మద్దిపడగ, పెద్దూర్, లంబాడితండా గ్రామాల పరిధిలోని వరి పంటలకు సదర్‌మాట్ కాలువ సాగు నీరందక పొలాలు ఎండుబారుతున్నాయి. వారం రోజుల నుంచి తమ పంట పొలాలకు సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు దుల్లె వెంకటేష్, రాపర్తి లక్ష్మణ్, శంకర్, రాజన్న, వెంకటేష్ వాపోతున్నారు. నీటి పారుదల శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇకనైనా నీటి పారుదల శాఖాధికారులు, కలెక్టర్ వెంటనే స్పందించి సదర్‌మాట్ నుండి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

బొగ్గు టిప్పర్లపై తాడిపత్రి వేసుకోవాలి

- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-మందమర్రి

బొగ్గు రవాణా చేసే టిప్పర్లపై తాడిపత్రి వేసుకోవాలని పోలీసులు సూచించారు. నవతెలంగాణలో మార్చి 1న పరిమితికి మించి బొగ్గు రవాణాలి అనే కథనం ప్రచురితమైంది. దీనిపై పోలీసులు స్పందించారు. సోమవారం టోల్ ప్లాజా సమీపంలో అదనపు ఎస్ఐ నూనె శ్రీనివాస్ ఆధ్వర్యంలో బొగ్గు రవాణా చేస్తున్న లారీలను పోలీసులు తనిఖీ చేశారు. బొగ్గుపైన తాడిపత్రి లేకుండా వెళ్తుండగా తాడిపత్రి వేసుకోవాలని, సరిపడా బొగ్గు మాత్రమే నింపాలని టిప్పర్ల యజమానులకు సూచించారు. ప్రమాదాలు జరగకుండా లారీ యజమానులకు, డ్రైవర్, క్లీనర్‌లకు నియమ నిబంధనలు తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ మాజీద్‌ఖాన్, కానిస్టేబుల్ రాజేందర్, చిరంజీవి, శ్రావణ్ పాల్గొన్నారు.

కరాటేలో జాతీయ స్థాయిలో సత్తా చాటిన వేదం విద్యార్థులు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన వేదం పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఇటీవల 3వ నేషనల్ ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్షిప్-2025 కరాటే పోటీల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటి వెండి, రజిత పతకాలు సాధించారు. జోహా సిల్వర్ కటాస్ హరిణి, సిల్వర్ కటాస్ సహస్ర, సిల్వర్ కటాస్ మేఘన, సిల్వర్ కటాస్ అభిలాష్, సిల్వర్ కటాస్ సాయి వర్ధన్, సిల్వర్ కటాస్ శ్రీమాన్, సిల్వర్ కటాస్ సంహిత, సిల్వర్ కటాస్ శ్రీచరణ్ బ్రాంజ్ కటాస్‌లను సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను, తీర్చిదిద్దిన కరాటే మాస్టర్ రాజేశ్వర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ అభినందించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జన్నారం

వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యం రాజన్నను ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం ఆసుపత్రికెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయనతో పాటు ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాఠశాల విద్య-2023 బదిలీల సందర్భంగా స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పాఠశాల విద్య-2024 డిఎస్సీ ద్వారా అక్రమంగా నియామకమైన ఉపాధ్యాయులను తొలగిస్తూ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2023 బదిలీల సందర్భంగా జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లు వినియోగించుకొని తమ స్పౌజ్‌కు దూరంగా కోరుకొని అర్హులైన ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేశారన్నారు. మొదటి ప్రాధాన్యత కింద స్పౌజ్‌కు దూరంగా ఉన్న పాఠశాలలను వీరు కోరుకోవడం, అవి అలాట్ కావడం జరిగిందన్నారు. తద్వారా అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. కేవలం ఫిర్యాదు వచ్చినవారిపైననే కాకుండా స్పౌజ్ పాయింట్లు వినియోగించుకున్న ఎస్‌జీటి, ఎస్ఏలు అందరిపై సమగ్ర విచారణ జరిపి స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా డీఎస్సీ నియామకాల్లో అర్హతలు లేకున్నా ఓ ఎస్‌జీటి ఉపాధ్యాయున్ని మరాఠీ మీడియం పాఠశాలలో నియమించారని పేర్కొన్నారు. సదరు అభ్యర్థికి వేతనం చెల్లించవద్దని ఉన్నతాధికారుల వద్ద నుండి మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. మరో అభ్యర్థికి స్పెషల్ ఎడ్యుకేషన్ కేటగిరిలో తలమడుగు మండలం కుచులాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటిగా పోస్టింగ్ ఇచ్చి, ఆ తరువాత పక్షం రోజులకు ఆయనను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. 5 నెలలుగా విచారణల పేరిట విద్యాశాఖాధికారి తాత్సారం చేస్తున్నారన్నారు. డీఎస్సీ-2024 నియామకాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నైపుణ్యం ఉంటేనే వృత్తిలో రాణిస్తారు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నైపుణ్యం ఉంటేనే వృత్తితో రాణిస్తారని డీఈఓ రామారావు అన్నారు. పంచశీల కాలేజీ, జిహెచ్ఎస్ కస్బా పాఠశాలలో డీఎస్సీ-2024 ఎస్‌జీటి అభ్యర్థులకు 3రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సంర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నైపుణ్యాలు కలిగి ఉంటేనే వృత్తిలో రాణిస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నర్సయ్య, కోర్స్ డైరెక్టర్ విజయ్‌కుమార్, అశోక్ వర్మ, పాల్గొన్నారు.

ప్లంబర్ అవతారమెత్తిన పంచాయతీ కార్యదర్శి



నవతెలంగాణ-దహెగాం

ప్రజల మంచినీటి అవసరాలను తీర్చడానికి దహెగాం గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు సోమవారం ప్లంబర్ అవతారం ఎత్తి ప్రజలకు మంచినీటిని సరఫరా చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ వాసులకు మిషన్ భగీరథ నీరు నిలిచిపోయినప్పటి నుండి నీటి కష్టాలు మొదలయ్యాయి. దీంతో ఇప్పటికే పంచాయతీలో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో నీటి కష్టాలు తోడు కావడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రస్తుతం వాడకంలో ఉన్న చేతిపంపుకు మోటార్‌ను బిగించి సుమారు 20 కుటుంబాలకు మంచినీరు అందేలా చేశారు. పీవీసీ పైపులకు వేరుగా నల్లాలను బిగించి నీటిని సరఫరా చేశారు. సొంతంగా తానే పనిచేసి ప్రజలకు నీరు సరఫరా చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

డిగ్రీ విద్యార్థినులతో అదనపు కలెక్టర్ ఇంటరాక్ట్



నవతెలంగాణ-నిర్మల్

బేటి బచావో బేటి పడావో కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమ ఆవశ్యకత తెలియజేసేందుకు జిల్లాలోని డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులతో సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ విద్యార్థినులను వివిధ అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలికలు అన్ని రంగాలలో రాణించాలని, జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని తెలిపారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పరిపాలన విధానం, భవిష్యత్తు ప్రణాళిక, మహిళా సాధికారత, బేటి బచావో బేటి పడావో ప్రాముఖ్యత తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ అధికారులు నాగలక్ష్మి, సవిత, మిషన్ శక్తి బృంద సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శిక్షణను తరగతి గదిలో ఉపయోగించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో ఉపయోగించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ అన్నారు. జిల్లాలో 2024 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఎస్జీటీలకు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా కొనసాగుతున్న శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదికి తీసుకెళ్లి, తరగతి గది లోపల వినియోగించుకుని, జిల్లాలోని విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచి, ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలన్నారు. గుణాత్మక విద్యను అందించాలని మార్గనిర్దేశం చేశారు. శిక్షణలో విషయం పట్ల పరిపక్వత, బోధన అభ్యసన ప్రక్రియల పట్ల సరైన వ్యూహాలను ఎంచుకోవడం, మూల్యాంకనం మదింపు పద్ధతులు, అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులు, ఉపకరణాలు, పాఠ్యపుస్తకాల సమర్థవంతమైన వినియోగం, సమర్థవంతమైన తరగతి గది ప్రక్రియలు, విద్యా ప్రమాణాలు, అభ్యసన ఫలితాలు, వార్షిక, పాఠ్యాంశ, పీరియడ్ ప్రణాళికలు, నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మదింపు తదితర అంశాలపై శిక్షణ నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విషయ నిపుణులు శంకర్, రమేష్, వెంకటేష్, చైతన్య, బాలకృష్ణ, ఝాన్సీరాణి, రంగయ్య, రాజేందర్, మహేందర్, నాగ గంగాధర్, గోవింద్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

జైపూర్: 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఎస్సై శ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులతో సమావేశమయ్యాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో విషయ పరిజ్ఞానంతో పాటు పరీక్షలకు ఆసక్తిని పెంపొందించుకోవడం ద్వారా ఆశించిన ఫలితాన్ని పొందవచ్చని తెలిపారు. బట్టిపట్టి చదవకుండా పాఠ్యాంశాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకుంటే పరీక్షా కేంద్రంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సమాధానాలు వస్తాయని తెలిపారు. సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవడంతో పాటు ప్రశ్నావళిని ముందుగా ఒకటి రెండు సార్లు చదివిన తర్వాత సమాధానాలు రాయాలని సూచించారు. గాబరా పడకుండా సమాధానాలు రాయడంతో పాటు తప్పులు, కొట్టివేతలు లేకుండా జాగ్రత్త పడాలని తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి

దహెగాం : మండలంలోని కొంచవెల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..తుమ్మెద చంద్రయ్య(45) ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్తానని చెప్పి బయటికి వెళ్లి తిరిగి సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గ్రామంలో, బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన బర్రెల కాపరి లక్ష్మక్క కుటుంబీకులతో చంద్రయ్య ప్రాణహిత కాలువ దగ్గర్లో కనిపించినట్లు తెలిపారు. ప్రాణహిత కాలువ పరిసర ప్రాంతాలలో వెతకగా నీటిలో మునిగి చనిపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శనగల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

శనగల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద శనగల కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర రూ.5650 పొందాలంటే తప్పకుండా రైతులు తమ సరుకును బాగా ఎండబెట్టి తర్వాత కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. రైతులు తమ వెంట పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-తాంసి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా సోమవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, ఎంపీడీఓ, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇల్లు నిర్మిస్తుందన్నారు. మండలంలో హస్నాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గుర్తించి 100 శాతం ఇల్లు లేని లబ్ధిదారులను గుర్తించి, వారికి ఇల్లు నిర్మించనున్నట్టు తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక కోసం సంబంధిత తహసీల్దార్ అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ నసీర్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.



అవినీతిపై జరిపిన విచారణను బహిర్గతం చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఖానాపూర్ సీడీపీఓ అవినీతిపై జరిపిన విచారణను బహిర్గతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. సోమవారం ఇంద్రనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖానాపూర్ సీడీపీఓ అవినీతిపై అధికారులు విచారణ జరిపి, ఐదారు నెలలు గడిచిన ఆ విచారణలను ఎందుకు బహిర్గతం చేయలేదో జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాలన్నారు. జిల్లాలో ఐసీడీఎస్‌లో చాలా సమస్యలు పేరుకుపోయని అన్నారు. అవినీతి ఆరోపణాలు పత్రికలలో వచ్చిన జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రెగ్యులర్ డీడబ్ల్యూఓని నియమించినట్లయితే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

ఎయిర్ పోర్ట్, సీసీఐపై బీజేపీ స్పష్టమైన వైఖరి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణతో పాటు ఎయిర్ పోర్ట్‌పై స్థానిక బీజేపీ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ స్పష్టమైన వైఖరి చెప్పాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ అంశంపై కేవలం ఎంపీ, ఎమ్మెల్యే ప్రకటనలకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఇచ్చిన హామీ ప్రకారం ఫ్యాక్టరీని ప్రారంభించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేసిన స్థానిక బీజేపీ నాయకులకు సీసీఐ పునరుద్ధరణ విషయంలో ఇప్పుడు ఎవరు అడ్డం వస్తున్నారో తేల్చి చెప్పలేక నీళ్లు మింగుతున్నారన్నారు. జిల్లా యువతకు ఎన్నికల ముందు సీసీఐ రీఓపెనింగ్ చేసి 5, 6 వేల ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇచ్చి, నేడు తుక్కు కింద అమ్మేయడానికి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. సీసీఐ ప్రస్తావన కోర్ట్ కేసులో ఉన్నప్పటికిని ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. కార్మికుల వేతనాలు, భూ నిర్వాసితులను మరోసారి మోసం చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీని ఆదిలాబాద్ జిల్లాకు స్థానిక ఎంపీ ఎమ్మెల్యేలు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీఎస్‌పీఎస్ పరిశ్రమ ద్వారా సీసీఐని పునరుద్ధరించేందుకు కేటీఆర్ ఆధ్వర్యంలో అప్పటి బీజేపీ కేంద్ర మంత్రులు హన్స్‌రాజ్‌ను కలవడం జరిగిందన్నారు. స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గెలిచాక విస్మరించడం జరుగుతుందన్నారు. ప్రజలకు సమాధానం చెప్పలేకపోతే త్వరలో అఖిలపక్షంతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి సీసీఐ పునరుద్ధరణ అంశంపై ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు విజ్జగిరి నారాయణ, సాజిదోద్దీన్, ప్రభాకర్, అడప తిరుపతి, బట్టు సతీష్, కుమ్ర రాజు, వినోద్, సాయి, ఆలం పాల్గొన్నారు.

గ్రామస్తుల ఆర్థిక సాయం



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని మంగల్ మోట గ్రామానికి చెందిన ఆడపడుచులు పేదింటి అమ్మాయి పెండ్లికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలతో ఆదివాసి గ్రామాలలో నూతనంగా పెండ్లి చేసుకున్న వధూవరులకు ఎలాంటి కట్న కానుకలు లేనందున, గ్రామంలో 60 కుటుంబాల ఆడపడుచులు తోచినంత పొదుపు చేసుకొని రూ.12,342 ఆర్థిక సాయాన్ని అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో కట్న కానుకలు నిలిపి వేయడంతో సామాగ్రి తెచ్చిన ఉపయోగం ఉండదనే ఉద్దేశంతో పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఆలోచనతో ఈ విధంగా గ్రామస్తులందరం కలిసి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఎస్‌సీ హెల్త్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ పర్వేజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో క్యాంపు కోఆర్డినేటర్ సిరాజ్, రషీద్ ఆధ్వర్యంలో గత పది రోజుల ముందు కార్మికుల ఇంటింటికి వెళ్లి 54 రకాల వైద్య పరీక్షల కోసం రక్త నమూనా బ్లడ్ శాంపిల్ తీసుకొన్నారు. సోమవారం 200మంది కార్మికుల వైద్య రిపోర్ట్ తీసుకొచ్చి వారికీ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ పర్వేజ్ మాట్లాడుతూ సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో, తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా ఉచితంగా వైద్య సేవలు అదించేందుకు లేబర్ కార్డు కలిగి ఉన్న కార్మికులకు ఇంటింటికి వెళ్లి షుగర్, బీపీ, కిడ్నీ, కాలేయం, హైట్, వెయిట్, యూరిన్, క్యాన్సర్ టుమార్, హెచ్ఐవి, థైరాయిడ్ ఇలా 54రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మండలానికి సంబంధించిన వైద్య పరీక్ష రిపోర్ట్స్ కార్మికులకు ఇంటికి వెళ్లి అందించారు. వైద్య పరీక్షల్లో రోగాలు ఉన్న సంబంధించిన మాత్రలు అందించడం జరుగుతుందన్నారు.

కఠోర శ్రమతో ఉన్నత స్థాయిలో రాణించొచ్చు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరంతర కఠోర శ్రమతో ఉన్నత స్థాయి క్రీడల్లో రాణించవచ్చని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. సోమవారం మూడో రాష్ట్రస్థాయి పోలీసు క్రీడలు, రెండు నెలల పాటు కరీంనగర్‌లో జరిగాయి. కాగా జిల్లా నుంచి పాల్గొన్న పోలీసు సిబ్బందికి 8 రంగాలలో 10 పతకాలను సాధించి, జిల్లా కీర్తిని పెంపొందించారని ఎస్పీ తెలిపారు. ఈ పది పతకాలను ఏడుగురు సిబ్బంది సాధించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్పీ స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో సిబ్బందిని ఆహ్వానించి, సాధించిన పతకాలను ప్రశంసా పత్రాలను అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. పలు అంశాలలో ఏడుగురు సిబ్బంది 10 పతకాలను సాధించడం జరిగిందన్నారు. సిబ్బంది అందరూ ప్రతి రోజు వ్యాయామం చేస్తూ, వారు సాధించిన అంశాలలో మరింతగా శ్రమిస్తూ మరిన్ని ఉన్నత స్థాయి పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు డి.వెంకటి, ఎస్.చంద్రశేఖర్, సీసీ దుర్గం శ్రీనివాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత సిబ్బంది పాల్గొన్నారు.


పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులతో ఎస్పీ గౌస్ ఆలం

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లాలోని అన్ని న్యాయస్థానాలలో ఈనెల 8న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల సోమవారం ప్రకటనలో తెలిపారు. నిర్మల్, బైంసా, ఖానాపూర్ కోర్టులో జాతీయ లోక్ అదాలతో నిర్వహించనున్నారని కక్షిదారులు పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ బాధితులకు మంచి అవకాశమని ఎస్పీ తెలియజేశారు. కేసులలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శాంతి, న్యాయం పొందాలని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్ల మేస్త్రీలకు వృత్తి నైపుణ్య శిక్షణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ హౌసింగ్ డిపార్ట్‌మెంట్, నేషనల్ అకాడమి ఆఫ్ కన్స్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జిల్లాలో 14 మండలాల్లోని 34 మంది తాపీమేస్త్రి పని చేసే వారికి ఆరు రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక డీపీఆర్‌సీ న్యాక్ శిక్షణ కేంద్రంలో ప్రారంభించారు. పలువురు అధికారులు ఈ శిక్షణకు సంబంధించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇంటి నిర్మాణానికి కావాల్సిన మెలుకువలు, పలు సూచనలు వివరించారు. ఈ శిక్షణలో మేస్త్రీలకు ఉచిత భోజన వసతి రోజు రూ.మూడు వందల ఉపకారవేతనం యూనిఫాం హెల్మెట్ శిక్షణ మెటీరియల్‌తో పాటు శిక్షణ అనంతరం సర్టిఫికేట్ అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ బసవేశ్వర్, ఏఈ నసిర్ అహ్మద్, పంచాయతీరాజ్ ఈఈ శివరామ్ రాథోడ్, న్యాక్ ఏడీ నాగేంద్రం, శిక్షకులు మహేష్ కుమార్, సిబ్బంది దీపక్, రమేష్, మెరి విక్టోరియా రాణి పాల్గొన్నారు.

కష్టపడిన వారికే పార్టీలో గుర్తింపు

- మంత్రి సీతక్క


మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికే గుర్తింపు, తగిన గౌరవం ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మహారాష్ట్రలోని వార్ధ సేవాగ్రామ్ సమావేశానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆదిలాబాద్‌లోని ప్రజాసేవా భవన్ క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించి, పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరిగిన అన్నీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన వారందరినీ గుర్తు పెట్టుకుంటామన్నారు. నామినేటెడ్ పదవులు కట్టబెట్టి వారికి తగిన గుర్తింపునిచ్చి గౌరవిస్తామన్నారు. కార్యక్రమంలో ఆత్రం సుగుణ, శ్రీలేఖ, ఉయిక ఇందిరా, నాయకులు బూర్ల శంకరయ్య, సింగిరెడ్డి రామ్‌రెడ్డి, మోర ఆశన్న, దేరా కృష్ణారెడ్డి, గడ్డం అఖిల్‌రెడ్డి, గిజ్జ నర్సింగ్, అఫ్రోజ్ అహ్మద్, అశోక్, అజిజ్ పాల్గొన్నారు.

సేవాగ్రామ్ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క...

మహారాష్ట్రలోని వార్ధ సేవాగ్రామ్‌లో నిర్వహించిన ముఖ్య సమావేశానికి సోమవారం జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి హజరయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. అనంతరం పలు సూచనలు చేశారని తెలిపారు.

మూగజీవాలకు తాగు నీరేదీ..?



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని ప్రతి సోమవారం పశువుల సంత కొనసాగుతుందని, ఈ సంతకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ఇతర జిల్లాలతో పాటు పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి ఎడ్లు, బర్రెలు, మేకలు, గొర్రెలు ఈ సంతకు రైతులు తీసుకొస్తారు. లక్షల్లో క్రయవిక్రయాలు కొనసాగుతాయి. కొందరు రైతులు అయితే రాత్రి తెల్లవారుజామున మూడు గంటల నుంచి పశువులను సంతకు తీసుకొస్తారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు సంతలో ఉన్న మూగజీవాలకు పశుగ్రాసంతో పాటు కనీసం తాగునీటిని కూడా అందుబాటులో ఉంచకపోవడం పట్ల పశువుల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పశువు అమ్మకం కొనుగోలు జరిగితే రూ.200 రసీదు చింపుతారు. ఇచ్చోడ గ్రామపంచాయతీకి కూడా వేలంలో లక్షల్లో ఆదాయం వస్తుంది. గుత్తేదారులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల మూగజీవాలకు తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయకపోవడాన్ని సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో తగు జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-కడెం

వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా తగు జాగ్రత్తలు పాటించాలని కడెం ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ శివకుమార్ సూచించారు. సోమవారం మండలంలోని సారంగాపూర్ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో భాగంగా 118 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వేణుగోపాల్, రాజేశ్వర్, మౌనిక, జ్యోతి, రాజమణి, జహీదా బేగం ఉన్నారు.

పోచమ్మ నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కడెం

మండలంలోని మొర్రిగూడెం గ్రామంలో పోచమ్మ నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి రాఘవేంద్ర ట్రస్ట్ అధినేత జన్నారం మండల మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ తన సొంత గ్రామం కావడంతో గ్రామంలో ఆలయ నిర్మాణాన్ని సొంతంగా నిర్మించడానికి భూమిపూజ చేశారు. గ్రామాభివృద్ధి కొరకు ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కన్నాపూర్ మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాధ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు ఉన్నారు.

రేపు వికలాంగులకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 5న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఎంపీడీఓ కే.భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట సదరస్ సర్టిఫికెట్‌తో పాటు వివిధ ధృవ పత్రాలను తమ వెంట తీసుకుని రావాలని ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు ఫ్రీ బస్ నడపాలి

నవతెలంగాణ-ఖానాపూర్

హైదరాబాద్ రాజధానికి మహాలక్ష్మి ఫ్రీ బస్‌ను నడపాలని వైడీ రెడ్డిమల్ల ఫౌండేషన్ చైర్మెన్ రెడ్డిమల్లా ఏసుదాస్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మండలాల ప్రజలు గతంలో ఖానాపూర్ నుంచి ఉదయం 5 గంటలకు, రాత్రి 9:30కు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిరంతరంగా నడిచేవని అన్నారు. ప్రస్తుతం వాటి స్థానంలో డీలక్స్ సర్వీసులు నడుస్తున్నాయని అన్నారు. ఈ ప్రాంత మహిళలు మహాలక్ష్మి ఫ్రీ బస్సు పథకం పొందలేకపోతున్నారని అన్నారు. ఈ ప్రాంతం నుంచి పైచదువులకు కోసం హైదరాబాద్ నగరంలో పిల్లలు చదువుకుంటున్నారని అన్నారు. అంతేకాకుండా కార్యాలయ పనులు, ఆస్పత్రి వైద్య సదుపాయాలు, కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో రాకపోకలు ఉంటాయన్నారు. గతంలో ఉన్నటువంటి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తీసేసి డీలక్స్ వేయడంతో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆశ్రయించాల్సి వస్తుందని అన్నారు. అంతేకాకుండా ప్రజలకు ఆర్థికంగా ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు స్పందించి ఖానాపూర్ నుంచి హైదరాబాద్‌కు మహాలక్ష్మి ఫ్రీ బస్సులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ ఐ కేర్ ఆప్టికల్ నేత్ర వైద్య సహాయకులు రెడ్డిమల్ల చిత్రలత, యంగ్ స్టార్ ఖానాపూర్ యూత్ అధ్యక్షులు షేక్ షకీల్ ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నాగోబాను దర్శించుకున్న బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కేస్లాపూర్ ఆలయాన్ని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ సోమవారం దర్శించుకున్నారు. దివంగత మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ తనయుడు రితేష్ రాథోడ్ ఇటీవల బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాగోబా దేవతను సందర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖ శాంతులతో క్షేమంగా ఉండాలని ప్రార్థించినట్టు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షులు ఆరెల్లి రాజలింగం, దేవాలయ కమిటీ మాజీ చైర్మెన్ మెస్రం తుకారాం, పెందూర్ గణేష్, దేవ్‌పూజే, మారుతి ఉన్నారు.

సంక్షేమ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వ ఉన్నత, అన్ని సంక్షేమ పాఠశాలల్లో బేటి బచావో బేటి పడావోలో భాగంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచనలు మేరకు ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8, 9వ తరగతి బాలికలకు ఉమెన్స్ డే సందర్భంగా వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాల్సిందిగా డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు మూడు విభాగాలుగా ఉంటుందని తెలిపారు. 4 తేదీ పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉన్న బాలికలను 5 తేదీ మండల స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన బాలికలకు 6న జిల్లాస్థాయి పోటీలు ప్రభుత్వ పాఠశాల ప్రియదర్శినినగర్ ఎన్టీఆర్ మినీ స్టేడియం నిర్మల్‌లో ఉదయం11 గంటలకు జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు, ఈ పోటీల్లో గెలుపొందిన వారికి 8న మహిళా దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయనున్నట్టు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | మార్చి 04, 2025 | www.navatelangana.com

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-దహెగాం




మండలంలోని కొంచవెల్లి నుండి భామనగర్ వెళ్లేదారిలో వంతెనపై ఇనుప చువ్వలు పైకి తేలి ప్రమాదకరంగా ఉండటాన్ని ఈనెల 1న నవతెలంగాణలో "పొంచి ఉన్న ప్రమాదం" అనే శీర్షికన కథనం ప్రచురితం చేయగా స్పందన లభించింది. స్థానిక మాజీ ఎంపీటీసీ గౌరే రాకేష్ స్పందించి సోమవారం ఇనుప చువ్వలను తొలగింజచేయించారు. దీంతో మాజీ ఎంపీటీసీకి ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



శ్రీకొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి- చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో ప్రతి మంగవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షలో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. సొసైటీ ఖర్చులతో రవాణ, భోజనం సదుపాయం కల్పించి 8 మందికి ఆపరేషన్ కోసం తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అనిత మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్ చేయించామని తెలిపారు. ఆపరేషన్ చేయించికొని లబ్ధిపొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని కోరారు.

గిరిజన విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చూడాలి

- గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రమాదేవి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు కామన్ బోర్డ్ పరీక్షలంటే భయం, ఒత్తిడి లేకుండా మానసికంగా సంసిద్ధులయ్యే విధంగా సంభంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీడీ ఆర్. రమాదేవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. తొలిరోజు ఇంగ్లీష్, హిందీ, తెలుగు, విషయాలు భోదించే ఉపాధ్యాయులుకు స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికలలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ జిల్లాలోని 36 ఆశ్రమ పాఠశాలల్లో 1255 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మంగళవారం గణితం, సాంఘిక శాస్త్రం, భౌతిశాస్త్రం, బయోలజీ భోదించే ఉపాధ్యాయులుకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఏసీఎంఓ పూర్కఉద్ధవ్ తెలిపారు. కాగా విషయ నిపుణులు (రీసోర్స్ పర్సనస్)తో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమలో జీసీడీఓ శకుంతల, ఏటీడీఓ చిరంజీవి, సెంటర్ ఇన్‌చార్జి నైతం కృష్ణరావ్, కే.రవీందర్, ఆర్‌పీలు రాథోడ్ రవీందర్, భారత్, ఖాలిఖ్, మాడుగుల నారాయణమూర్తి, జాగేష్, అరుణ దేవి, కుడ్మేత జంగు పాల్గొనారు.

చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని అబ్దుల్ కలాం స్కూల్‌లో షీటీం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వర్లు, మహిళా ఎస్సై శిరీష విద్యార్థులకు మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు జాగ్రత్త వహించాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. ఈవ్‌టీజింగ్, హింసకు గురైతే డయల్ 100, షీటీం ఆసిఫాబాద్ ఫోన్‌నం. 8712670564కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్, సిబ్బంది, షీటీం సభ్యులు స్వప్న పాల్గొన్నారు.

కార్మికులను వేధిస్తున్న డీఎంను సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ డిపోలో పని చేస్తున్న కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న డిపో మేనేజర్ విశ్వనాథ్‌ను సస్పెండ్ చేసి పని భారాన్ని తగ్గించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి, జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు కె.ఎస్. రావు కోరారు. సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆసిఫాబాద్ డిపోలో పని చేస్తున్న కార్మికులపై భారం పెంచి వేధింపులకు గురి చేస్తున్నారని, ఆసిఫాబాద్ నుండి హైదరాబాద్ వెళ్ళే సర్వీసులను నడిపితే మూడు రోజుల పని దినాలుగా ఉన్న దానిని రెండు రోజులకు కుదించే కుట్ర చేస్తున్నారని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పెరుతో పని చేయని మిశన్ ద్వారా టెస్ట్ చేసి కార్మికులపై తప్పుడు నివేదికలు ఇచ్చి సస్పెండ్ చేయడం, సర్వీస్ నుండి రిమూవల్ చేయడం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే డీఎంను సస్పెండ్‌చేయాలని కోరాగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారని ఏమాజి తెలిపారు. ఆయనతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు కేశవరెడ్డి, ఆర్టీసీ కార్మికులున్నారు.

రేపటి నుంచి మహిళలకు క్రీడా పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5 నుంచి మహిళలకు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్టు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనుజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలోని మాదారం, గో లేటి ఆఫీసర్స్ క్లబ్, గోలేటి సింగరేణిహై స్కూల్ మైదానంలో మహిళలకు పలు క్రీడలుంటాయన్నారు. 5న గోలేటి టౌన్ షిప్‌లోని జీటీసీఓఏ క్లబ్‌లో సాయంత్రం 4 గంటలకు, 6న మాదారంలోని కమ్యూనిటి హాల్, 7న గోలేటిలోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుండి పోటీలుంటాయన్నారు. గెలపొందిన మహిళలకు మార్చి 8న గోలెటి సీఈఆర్ క్లబ్‌లో జరిగే అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలలో బహుమతులు ప్రధానం చేయడం జరుగుతోందన్నారు.

సర్క్యులర్ నెం.333ని రద్దు చేయాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం రిలీజ్ చేసిన సర్క్యులర్ నం.333ని రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం చింతగూడ, కోయవాగు గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫారెన్సీ, ఎకౌంట్‌బులిటీ పేరుతో కేంద్రంలోని మోడీ సర్కారు తెచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి విరుద్ధంగా ఉందన్నారు. ఈ సర్క్యులర్ పేదలకు మెరుగైన పని కల్పన కంటే కార్పొరేట్ కంపెనీల సెల్ ఫోన్లు, సిమ్ కార్డులు గ్రామీణ ప్రాంతాలకు ప్రమోట్ చేసే చర్యలాగా ఉందన్నారు. దీని అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్క్యులర్ నం.333ని తక్షణమే రద్దు చేయాలన్నారు. పని ప్రదేశంలో కూలీల ఫోటోలు ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలలోపు స్మార్ట్ ఫోన్‌ల ద్వారా మెట్లు అప్‌లోడ్ చేస్తేనే కూలీల మస్టర్ గుర్తించి వేతనాలిస్తామని చెప్పాడం ఉపాధి చట్టానికి తూట్లు పొడవడమే అవుతుందన్నారు. అండ్రాయిడ్ 10 వర్షన్ ఫోన్, 4జీ లేదా 5జీ కనెక్షన్ ఉంటేనే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ సపోర్టు చేస్తుందని సర్క్యులర్‌లో పేర్కొనడం జరిగిందన్నారు. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేదలు ఇంత ఖరీదైన ఫోన్‌లు కొనుగోలు చేయడం ఎలా వీలవుతుందని ప్రశ్నించారు. ఆదివాసీ ఏజెన్సీ ప్రాంత గిరిజనులతో పాటు వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న పేదలను పనికి దూరం చేయాలనే లక్ష్యంతోనే కేంద్రం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్‌కు 20 కూలీల ఫోటోలు అప్‌లోడ్ చేయాలనడం, ప్రతి గ్రూప్‌లో 50శాతం మహిళలు తప్పని సరిగా ఉండాలనడం ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెట్లకుభారం పెరిగే అవకాశం ఉందని, ఫోన్‌లు, రీఛార్జీ చేసుకోలేని మేట్లు పని హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే ఈ సిస్టం రద్దు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



సిర్పూర్ : విద్యార్థులో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

అడవితో పాటు అటవీ ప్రాంతంలో నివసించే ప్రతి కొన్ని జీవులు మన జాతీయ సంపదగా గుర్తించి వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఎఫ్ఆర్ఓ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో జడ్పీ స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలిలో మానహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వన్యప్రాణులను వేటాడినా, వాటి ఆవాసాలను ధ్వంసం చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీధరాచారి, సెక్షన్ ఆఫీసర్లు తిరుపతి, మోతిలాల్, మోహనరావు, ప్రసాదరావు, జడ్పీ స్కూల్ ఉపాధ్యాయులు, బీట్ ఆఫీసర్లు, వాచర్లు పాల్గొన్నారు.

బెజ్జూర్ : బెజ్జూరు మండల కేంద్రంలో సోమవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా బెజ్జూర్ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, అటవీశాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు. బెజ్జూర్ మండల కేంద్రంలో అటవీశాఖ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీసందర్భంగా బెజ్జూర్ రేంజ్ అధికారి ముసవీర్ మాట్లాడారు .వన్య ప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రవణ్ కుమార్, బెజ్జూరు బీట్ అధికారులు వెంకటేష్, గోపాల్, వెంకటేష్, సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్యప్రాణుల ప్రాముఖ్యత, జీవ వైవిధ్యంలో ప్రకృతి పర్యావరణ సమతుల్యతను కాపాడడం జంతువుల పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులకు కూడా వన్యప్రాణుల రక్షణ గురించి తెలియజేయాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి జగన్మోహన్ గౌడ్, బీట్ అధికారులు సతీష్, సంగదీప్, స్వర్ణలత, విజయలక్ష్మి, ఎనిమల్ ట్రాకర్స్, ఉపాధ్యాయులున్నారు



బెజ్జూర్ : విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న అటవీ శాఖ అధికారులు



పెంచికల్‌పేట్ : వన్యప్రాణులపై అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

ప్రభుత్వ పథకాలు చేరే వరకు కృషి

- జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కుడ్మెత విశ్వనాథ్



జైనూర్ : భూమి పూజ నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మెన్

నవతెలంగాణ-జైనూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరాగా ఉంటూ అన్ని పథకాలను ప్రతి లబ్దిదారుడికి చేరేవరకు కృషి చేస్తుందని జైనుర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ అన్నారు. సోమవారం మండలంలోని మార్లవాయి గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా 52 ఇందిరమ్మ ఇళ్లకు తహసీల్దార్ బిర్‌షావ్, మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేష్ రావు, మండల ప్రజాప్రతినిధులతో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల పాటు నీడ ఆశ్రమం కల్పించని వాళ్ళు పేద ప్రజలకు అందిస్తున్న పథకాలని చూసి ఒర్వలేక పోతున్నారని మండిపడ్డారు. కమీషన్ లీడర్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడిన నాటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత 200 యూనిట్ల విద్యుత్ పంపిణీ, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నారు. మెరుగైన వైద్యం, కొత్త రెషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, మార్లవాయి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ అడ బీర్‌షా, ఏఈ రత్నం, ఎంపీఓ మోహన్, కార్యదర్శి మనోజ్, మార్కెట్ కమిటీ మెంబెర్స్ మండాడి లింగు, సార్‌మెడి జుగ్నక దేవ్‌రావ్, దేవారి హన్మంత్, హైమన్ డార్ఫ్ యూత్ అధ్యక్షులు మడవి మధురాజ్ రావ్, గ్రామస్తులు, లబ్ధిదారులున్నారు.

తిర్యాణి : మండలంలోని రొంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ఎంపీడీఓ వేముల మల్లేష్ భూమిపూజ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా రొంపల్లి గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. గ్రామంలో దాదాపు 106 ఇల్లు మంజూరు కాగా సోమవారం రెండిళ్లకు భూమి పూజ చేశామని ఎంపీడీఓ మల్లేష్ తెలిపారు. కొన్ని ఏండ్లుగా ఇండ్ల కోసం నిరీక్షించిన పేదప్రజలకు ప్రభుత్వం ఇండ్లు కేటాయించడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిత్తారిసాగర్, పెరుమళ్ళ వెంకటేశం గౌడ్, చాకటి జగన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



తిర్యాణి : భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ మల్లేష్

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అక్రమంగా రవాణ చేసేందుకు వ్యవసాయ పొలంలో నిల్వ ఉంచిన 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం రాత్రి ఆసిఫాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఆసిఫాబాద్ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆసిఫాబాద్ మండలం బురుగూడ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో అక్రమంగా నిల్వ ఉంచిన 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సమాచారంతో రైడ్ చేసి పట్టుకున్నారు. వీటితో పాటు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న బి.రాజేశ్వర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో రూ.15కు కొనుగోలు చేసి రూ.20కు అమ్ముతున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని రాజేశ్వర్ అనే వ్యక్తి అక్రమ దందాను నడిపిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించి తూకం వేయగా 9 క్వింటాళ్ల ఉన్నాయని విచారణలో తేలినట్టు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రబీ పంట సాగుకు నీరందించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రాజెక్టులు, చెరువుల క్రింద సాగు చేసే పంటలకు నీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్ శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సాగునీటి శాఖ అధికారులు, వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రావు, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, నీటిపారుదల శాఖ ఈఈలు ప్రభాకర్, గుణవంత్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, సాగునీటి శాఖ అధికారులతో హాజరయ్యారు. జిల్లాలోని ప్రాజెక్టులు, ఇతర వివరాలను ఆయన సీఎస్‌కు వివరించారు.

ఫూలే, అంబేద్కర్ ఆశయాల సాధనకు పోరాటం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫూలే, అంబేద్కర్ ఆశయాల సాధన కోసం కేవీపీఎస్ సంఘం పోరాడుతుందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అరుంధతి భవనంలో జరుగుతున్న రాష్ట కమిటీ సమావేశాలకు హాజరై మాట్లాడారు దేశంలో రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర జరుగుతోందని ఆ కుట్రను ఫూలే, అంబేద్కర్ వాదులు ఐక్యంగా తిప్పి కొట్టాలని అన్నారు. ఒక వైపు అంబేద్కర్‌ను మొక్కుతూ మరో వైపు ఆయన ఆశయాలను నీరుగారుస్తున్నారన్నారు.

ఘనంగా శివశంకరుని జాతర

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బెండారా గ్రామ సమీపం వద్ద నిర్వహించే శివశంకరుని జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారని పూజారి ధర్మయ్య తెలిపారు. మండలంలోని సరండి, నార్లాపూర్, కోమటిగూడ, కన్నర్‌గావ్, వాంకిడి తదితర గ్రామాల నుండి భక్తులు హాజరై తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విరమణ పొందిన ఉద్యోగుల మొత్తాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో పనిచేసే ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ మొత్తాలు వెంటనే చెల్లించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డిపో మేనేజర్ విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు 2017 పీఆర్సీ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. చివరి నెల జీతంతో పాటు గ్రాట్యూటీ, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ మొత్తాలు రావాల్సి ఉందన్నారు. సకాలంలో డబ్బులు రాకపోవడంతో ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో మొత్తాన్ని చెల్లించేల చూడాలన్నారు. వెంటనే డిపో మేనేజర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బకాయిలు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ విరమణ చెందిన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షుడు దివాకర్, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | మార్చి 04, 2025 | www.navatelangana.com

పది వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో పదోతరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్ఎస్‌సీ పరీక్షలకు జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోసిట్ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మినహా మిగతా పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 21న ఫస్ట్ లాంగ్వేజ్, ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-1, పార్ట్-2, 22న సెకండ్ లాంగ్వేజ్, 24న థర్డ్ లాంగ్వేజ్, 26న మాథమెటిక్స్, 28న సైన్స్ పార్ట్-1 ఫిజికల్ సైన్స్, 29న సైన్స్ పార్ట్-2 బయోలాజికల్ సైన్స్, ఏప్రిల్ 2న సోషల్ స్టడీస్, 3న ఓఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సాన్‌ఇట్, అరబిక్), ఎస్ఎస్‌సి. ఒకేషనల్ కోర్స్(థియరీ), 4న ఓఎస్ఎస్-సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సాన్సిట్, అరబిక్) పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-మందమర్రి



ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా క్షేత్ర స్థాయి ప్రదర్శనలో భాగంగా తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు భువనగిరి జిల్లాలోని 'వన్ డే కిసాన్' వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. నీటిని నిల్వచేసే విధానాలను, పొలాలలో నాటు వేయడం, దున్నడం పండిన పంట కోయడం, ధాన్యాలను దంచే పరికరాలను, మట్టిలో కుండలను తయారుచేసే నైపుణ్యాలను తెలుసుకున్నారు. కర్షకుల గొప్పతనాన్ని, దేశానికి వెన్నెముక రైతు పడే శ్రమని, రైతు అవసరం ఎంతైనా ఉందని గ్రహించారు. ఈ ప్రదర్శనలో ప్రిన్సిపల్ సారా తస్నీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటలో బస్ షెల్టర్‌లు నిర్మించాలి

- అంబేద్కర్, ఎన్టీఆర్ చౌరాస్థాల్లో అత్యవసరం
- మున్సిపల్ అధికారులకు వినతిపత్రం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా, ఎన్టీఆర్(కరీంనగర్) చౌరస్థాల్లో బస్ షెల్టర్‌లు నిర్మించాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు మున్సిపల్ అధికారులను కోరారు. సోమవారం పట్టణంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణంలో ఎండలు పెరిగిపోయాయని, గత సంవత్సరం తమ విజ్ఞప్తి మేరకు తాత్కాలిక షెడ్లు వేశారన్నారు. కానీ ఈ సంవత్సరం ఇంకా షెడ్లు వేయలేదన్నారు. వివిధ పనుల రీత్యా చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు నిత్యం ప్రయాణిస్తరన్నారు. కాబట్టి వెంటనే ఆయా కూడళ్ళలో బస్ షెల్టర్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు చిప్పకుర్తి నారాయణ, మాలెం చిన్నన్న, సీనియర్ నాయకులు గోల్కొండ సత్తయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, పెండెం సత్తయ్య, వేముల ప్రేంసాగర్, చామనపల్లి కిషన్ పాల్గొన్నారు.

అఖిల భారత పద్మశాలి మహా సభలను వియవంతం చేయండి



నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 9వ తేది నిర్వహించే అఖిల భారత పద్మశాలి సంఘం తెలంగాణ రాష్ట్ర 8వ మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలువేరి సదానందం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మశాలి కుల బందవులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9వ తేదిన హైదరబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే మహాసభలను 10 లక్షల మందితో నిర్వహిస్తున్నారని ఈ మహా సభలకు మండలంలోని పద్మశాలి కులబాంధవులందరు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ మహా సభలలో పద్మశాలి కులస్తుల హక్కులకు చర్చించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు చెటుపల్లి గంగయ్య, పట్టణ అధ్యక్షుడు చెటుపల్లి కృష్ణ, పద్మశాలి కులస్తులు ఆడెపు సత్యనారాయణ, దోమల బాస్కర్, మదు, చెటుపల్లి రాజమౌళి, కందుల రమేష్, గోనె సత్యం, కొప్పుల రమేష్, రాము, వేణు, నరేందర్ పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఆరోగ్య సూచనలు పాటించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

ఆడపిల్లలు ఆరోగ్య సూచనలు పాటిస్తూ రుతుస్రావం సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహిళ సాధికారిత కేంద్రం సభ్యులు, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని తీగల్ పహాడ్ ప్రభుత్వ పాఠశాలలో బాలికలు రూతుస్రవం సమయంలో తీసుకోవల్సిన జాగ్రతలపై అవగాహనా కల్పించారు. రుతుస్రావం సమయంలో ఏర్పడే సమస్యలు దాని పట్ల ఉన్న సందేహాల పై అవగాహనా కల్పించారు. నాణ్యమైన ఆహార పదర్తాలు తీసుకొని ఎల్లపుడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఏర్పడితే మొహమాటం లేకుండా తల్లితో పంచుకోవాలని సూచించారు. అనంతరం పిల్లలకు సానిటరీ క్లాత్స్, నాప్కిన్స్ అందించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారీత కేంద్రం జిల్లా సమన్వయ కర్త సౌజన్య ఐసీడీఎస్ సూపర్ వైజర్ చందన, మహిళ సాదికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ విజయ, అకౌంటెంట్ వసంతలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-తాండూర్

హైదరాబాద్ యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఓపెన్ స్టేట్ లెవెల్ తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలలో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారని టైక్వాండో ప్రెసిడెంట్ సిద్ధమల్ల చిరంజీవి, జనరల్ సెక్రెటరీ బోగే రాజేష్ తెలిపారు. ఐబీ తాండూర్ విద్యా భారతి హై స్కూల్ నుంచి కె శివ చరణ్ స్పారింగ్ విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించారని తెలిపారు, ఐ సాత్విక్ స్పారింగ్ విభాగంలో సిల్వర్ మెడల్, బెల్లంపల్లి లోటస్ స్కూల్ కు చెందిన కే రోషన్ సాయి, సీఓఈ రెసిడెన్షియల్ స్కూల్(బాయ్స్) బెల్లంపల్లికి చెందిన దుర్గం ఓంనాథ్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు.

బాలికల సీనియర్ విభాగంలో

సుబ్బారావు పల్లికి చెందిన ఎల్ శ్వేత గోల్డ్ మెడల్, వేమనపల్లికి చెందిన ఐ శ్రావణి సిల్వర్ మెడల్ సాధించారన్నారు. విజేతలను టైక్వాండో స్టేట్ సెక్రటరీ ఏ ప్రవీణ్ కుమార్ సీఓఈ ప్రిన్సిపాల్ దూట శ్రీధర్, విద్యా భారతి హై స్కూల్ ప్రిన్సిపాల్ శరత్ అభినందించారు.



అందుబాటులో ఇంటిగ్రేటెడ్ బీఈడీ

- ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అవకాశం
- అవగాహన లోపంతో మిగిలిపోతున్న సీట్లు
- నూతన విద్యా విధానంలో డిగ్రీతో పాటు నాలుగేండ్ల కోర్సు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశలలో నాలుగు సంవత్సరాల 'ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్' కోర్సు అందుబాటులో ఉన్నా చాలా మంది విద్యార్థులకు అవగాహన లేక ప్రతి ఏటా సీట్లు మిగిలిపోతున్నాయి. ఆ కోర్సులో ప్రవేశానికి 2025-26 విద్యా సంవత్సరం నోటిఫికేషన్ వెలువడింది. 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2025' పేరిట జరిగే ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నిర్వహిస్తుంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 64 విద్యా సంస్థల్లోని 6,100 సీట్లలో అడ్మిషన్లు పొందవచ్చు. పరీక్షల్లో ర్యాంకు ఆధారంగా ఆయా సంస్థలు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించి బీఏ-బీఈడీ, బీకాం-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ కోర్సులో సీట్లను భర్తీ చేస్తాయి. ఇంటర్ విద్యార్హత ఉన్న వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులో చేరడానికి ఎలాంటి వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం

కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలను అడుగుతారు. ఈ పరీక్ష తెలుగు, ఇంగ్లిష్, హిందీతోపాటు 13 భాషల్లో పరీక్షలు రసేందుకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల మార్చి 16 నుంచి ఏప్రిల్ 29 వరకు దరఖాస్తుల స్వీకరణ చివరి గడువుగా ప్రకటించారు.

నూతన విద్యా విధానంతో కోర్సు ప్రారంభం

నూతన విద్యావిధానం-2020కు అనుగుణంగా ఉపాధ్యాయ విద్యలో కూడా మార్పులు చేర్పులు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ ఇంటిగ్రే టెడ్ బీఈడీ కోర్సులో యోగా, వ్యాయమ విద్య, ఆర్ట్స్, సంస్కతం ప్రవేశపెట్ట నున్నారు. ఇవి 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి రానున్నాయి. అలాగే ఇప్పటి వరకు ఏ కోర్సులోనైనా విద్యార్థులకు 75 శాతం హాజరు తప్ప నిసరి అన్న నిబంధన ఉండేది. ఇక దీనిని 2026-27 విద్యా సంవత్సరం నుంచి 80 శాతానికి పెంచనున్నారు. ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్ పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఇంటర్ అర్హత ఉన్నవాళ్లు సద్వినియోగం చేసుకోవాలి

డా. మహాత్మా సంతోష్, కళాశాల ప్రిన్సిపాల్ లక్షెట్టిపేట



లక్షటిపేట పట్టణంలో సువిశాలమైన పది ఎకరాల స్థలంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యుత్తమ ఉపాధ్యాయ విద్య కోర్సు అందుబాటులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో మూడు కళాశాలలు మంజూరు కాగా ఒకటి నీట్ వరంగల్, రెండోది మను కేంద్రీయ విశ్వవిద్యాలయం కాగా మూడోది లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంజూరు అయ్యింది. కళాశాలలో అధ్యాపక బృందంతో పాటు, తరగతి గదులు, వసతులు అన్ని అందుబాటులో ఉన్నాయి.

విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం

డాక్టర్ ఎం.సంతోష్ కుమార్, కళాశాల కోఆర్డినేటర్, లక్షెట్టిపేట



ఇంటర్ విద్యార్హత కలిగిన వారు జాతీయస్థాయి పరీక్షకు హాజరై ప్రవేశం పొందే విధంగా విస్తతమైన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సోషల్ మీడియా వేదికగా కూడా అవగాహన కల్పిస్తున్నాం. ఇలాంటి సువర్ణ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

ప్రత్యేక చొరవతో బోధిస్తున్నారు..

జి ఉషశ్రీ విద్యార్థిని, హన్మకొండ



వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు రావడంతో వారికి అనుగుణంగా ప్రత్యేక చొరవ చూపిస్తూ బోధిస్తున్నారు. ఉపాధ్యాయ విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధిస్తూ చక్కగా అవగాహన కల్పిస్తున్నారు.

అన్ని వసతులతో కూడిన బోధన

రంజన్ కుమార్ మొహంతా, కళాశాల విద్యార్థి, ఒరిస్సా రాష్ట్రం



ఇతర రాష్ట్రం నుండి వచ్చినందుకు అహ్లాదకరమైన వాతావరణంతో పాటు అన్ని వసతులతో కూడిన బోధన అందిస్తున్నారు. విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్లాసులతో అవగాహన కల్పిస్తూ బోధిస్తున్నారు.

ఆర్థిక సంవత్సరం ముగింపు ప్రక్రియ పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలలో బడ్జెట్, నిధుల వినియోగం తదితరాల సంబంధిత ఆర్థిక సంవత్సరం ముగింపు ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి సత్యంతో కలిసి మున్సిపల్ కమీషనర్లు, ఈఈలు, ఎంపీడీఓలతో ఆర్థిక సంవత్సరం ముగింపుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ శాఖల పరిధిలో కేటాయించిన అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు, ఖర్చుల వివరాలు, గుత్తేదారులకు కేటాయించిన పనుల వివరాలు, ఖర్చులు, జీఎస్టీ, ఇతర పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు. శాఖల వారిగా అభివృద్ధి, సంక్షేమ పనులకు కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో ఖర్చు చేసి పనులు పూర్తి చేసినట్లయితే నిర్ధారణ చేసి 5 రోజులలోగా ధ్రువపత్రం సమర్పించాలని, డీఎంఎఫ్‌టీ నిధులకు సంబంధించి పనులకు నిబంధనల ప్రకారం అడ్వాన్స్ విడుదల చేసుకోవాలని, లేకపోతే నిధులు తిరిగి అందించాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, సంబంధిత బిల్లులు సమర్పించాలని, మార్చి-2025 ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా నిధుల విడుదల, పనుల పురోగతి, ఇతర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి స్థాయిలో నివేదిక అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్రంలో లక్షలాదిమంది రజక వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చినటువంటి అన్ని వాగ్దానాలను అమలు చేసి రజకులను అన్ని విధాల ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చార్వక హాల్‌లో తెలంగాణ రజక వృత్తి దారుల సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు తంగేళ్లపల్లి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రజక వృత్తిదారులకు ఇచ్చినటువంటి హామీలలో వృత్తి ఆధునికరణ, ఉపాధి కల్పన మోడ్రన్ మేకనైజింగ్ లాండ్రీల నిర్మాణం, అదేవిధంగా వృత్తిదారులకు రూ.10 లక్షల వరకు ఆర్థిక సహకారం పథకం, వృత్తిదారులందరికీ పెన్షన్, రజక ఫెడరేషన్‌కు పాలకవర్గ నిర్మాణం, రజకుల రక్షణ చట్టం వీటన్నింటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు మాట్లాడుతూ వృత్తిదారులు ఎదుర్కొన్నటువంటి సమస్యలపైన ఇంటింటి సర్వే అదేవిధంగా సమస్యలపైన మండల గ్రామస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయాలని, అందులో రజకులు అందరు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజుల రామచంద్రం, నడిగోట తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి పైతారి ఓదేలు, ముషికే చందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగెపు హనుమంతు, జాలిగాపు రాజేశ్వరి, తరిగొప్పుల భాగ్య, తోట కళావతి, కంచర్ల శ్రీనివాస్, పున్నం సమ్మయ్య, పాయిరాల రమేష్, కొండపర్తి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరపల్లి రోడ్డుపై అర్థరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన దుర్గం అంజన్న(20) మృతి చెందినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గం అంజన్న పని నిమిత్తం స్కూటీపై మందమర్రికి వెళ్లి తిరిగి దుబ్బగూడెంకు వస్తుండగా అంజన్న అతి వేగంగా మార్గ మధ్యలోని చొప్పరపల్లి గ్రామంలోని నేషనల్ హైవే గ్రామ సర్వీస్ రోడ్డు రేలింగ్‌కు ఢీకొట్టగా తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అంజన్న మృతితో ఆ గ్రామంలో విషాదం అలుముకుంది. ఉన్న ఒక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబీకుల రోధనలు అందరినీ కలిచి వేశాయి. ఈ మేరకు మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



నవతెలంగాణ-మందమర్రి

ఆధునిక సాంకేతిక విద్యా ప్రమానాలను మరింత పెంపొందించి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అభ్యర్థులకు అందించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణ పనులను తహసీల్దార్ సతీష్, ఎటీసీ ప్రిన్సిపల్ దేవానంద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలోని సాంకేతికను అభ్యర్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ఆధునిక రంగాలలో అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా వివిధ అత్యాధునిక సాంకేతికత కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి పొందేలా అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చేంజ్ ఆఫ్ క్వార్టర్స్‌కు అందరికీ అవకాశం కల్పించాలి



నవతెలంగాణ-నస్పూర్

చేంజ్ ఆఫ్ క్వార్టర్స్‌కు అందరికీ అవకాశం కల్పించాలని శ్రీరాంపూర్ ఏరియా హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా హెచ్ఎంఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికులకు కేటాయించబడుతున్న క్వార్టర్స్‌లో యాజమాన్యం వివక్ష చూపుతుందని, గత ఆరు నెలలుగా చేంజ్ ఆఫ్ క్వార్టర్స్‌పై క్వార్టర్స్ సంబంధించిన వారికి మాత్రమే చేంజ్ ఆఫ్ క్వార్టర్‌నకు అవకాశాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. అందరికీ ఈ విషయంలో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చాలామంది కార్మికులు గతంలో కింది క్వార్టర్స్‌ను తీసుకొని అ సౌకర్యంగా ఉండడంవల్ల చేంజ్ ఆఫ్ క్వార్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారని, యాజమాన్యం కింది క్వార్టర్స్‌కు సంబంధించిన వారికి అవకాశాలు ఇవ్వకపోవడం మూలంగా తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. అలాగే సొంత ఇల్లు నిర్మించుకున్న కార్మికులు తమకు ఉన్నటువంటి క్వార్టర్లు సింగరేణి యాజమాన్యానికి అప్పగిస్తే యాజమాన్యం వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా తిరస్కరిస్తుందని, హెచ్ఆర్ఏ అవసరం లేదని రాసిస్తేనే క్వార్టర్లు తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరిస్తుందని ఆరోపించారు. సింగరేణిలో ఎక్కడలేని విధంగా కేవలం శ్రీరాంపూర్ ఏరియాలోనే కార్మిక వ్యతిరేక నిబంధనలను అమలు చేస్తున్నారన్నారు. సింగరేణి కార్మికులు క్వార్టర్లు అప్పగించినట్లయితే వెంటనే తీసుకొని హెచ్ఆర్ఏ బేషరతుగా చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి, ఏరియా నాయకులు కంబాల నర్సయ్య, కొమురయ్య, అశోక్, తుల అనిల్, సందీప్, వెంకటస్వామి పాల్గొన్నారు.

పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

హైదరాబాద్‌లో మార్చి 9న జరిగే 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలను విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. సోమవారం కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో పద్మశాలి మహాసభకు వెళ్లేందుకు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు 9వ తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం, గ్రామ అధ్యక్షుడు గడ్డం పురుషోత్తం, సుంకె రాజమొగిళి, బింగి శ్రీనివాస్, బొల్లు దాసు, భూర్ల ప్రభాకర్, గుండ వెంకటేశ్, సత్యనారాయణ, దానం వెంకట స్వామి, ఎనగంటి సత్యనారాయణ, వేముల మల్లేశ్ పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం

నవతెలంగాణ-తాండూర్

కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లిలో 8వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం సోమవారం నిర్వహించామని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా కోట శివకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పొలాస ఇన్‌చార్జి సహ వ్యవసాయ పరిశోధనా సంచాలకులు శ్రీలత అధ్యక్షతన వహించారని తెలిపారు. కుమురంభీం, కరీంనగర్ జిల్లాలలోని కృషి విజ్ఞాన కేంద్రం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు గత సంవత్సరం చేపట్టిన పరిశోధన అంశాలమీద వచ్చే వానాకాలం, యాసంగిలో చేపట్టబోయే పరిశోధన అంశాల మీద సమీక్ష నిర్వంచారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ మరింత సమన్వయంతో ముందుకు సాగుతూ రైతులకు వ్యవసాయ సాంకేతికతను అందించాలని సూచించారు. ప్రాంతాలకు అనుకూలంగా అభివృద్ధి చేసిన పరిశోధనా ఫలాలు ప్రతి ఒక్క రైతుకు చేరుకునేలా ప్రణాళికలలు రూపొందించాలని తెలిపారు.

వాహనం ఢీకొని 14 గొర్రెలు మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గుర్తుతెలియని వాహనం ఢీకొని 14 గొర్రెలు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని బూరుగుడ సమీపంలోని మైసమ్మ ఆలయం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ గొర్రెల కాపరికి చెందిన గొర్రెలు రోడ్డు దాటుతున్న క్రమంలో మహారాష్ట్ర నుండి మంచిర్యాల వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో 14 గొర్రెలు మృతి చెందాయి. ఒకేసారి రోడ్డు ప్రమాదంలో 14 గొర్రెలు మృతి చెందడంతో యజమాని కన్నీరు మున్నీరయ్యాడు.

ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-ముధోల్



మండలంలోని చించాల గ్రామంలో సోమవారం పెద్దమ్మ తల్లి అలయ మొదటి వార్షికోత్సవం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజారి శివ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అర్చనలు, హారతి తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పెద్ద లస్మన్న, మైస లస్మన్న, ఒరగంటి పండరి, శివరాం, తునుకు హన్మండ్లు, తానూర్ పండరి, ముత్తన్న, లక్ష్మీ కాంత్, భైరోళ్ల నడిపి లస్మన్న, భైరోళ్ల చిన్న లస్మన్న, సాయన్న, ఈరన్న, సాయినాథ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై బ్లేడుతో దాడి

నవతెలంగాణ-కెరమెరి

మద్యం మత్తులో ఓ వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసిన సంఘటన సోమవారం మండల కేంద్రంలో కలకలం రేపింది. ఎస్సై గుంపుల విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న మడావి గన్ను విధులు ముగించుకొని మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో మద్యం మత్తులో అక్కడికి వచ్చిన దినేష్ సింగ్ ఆస్పత్రి అడ్రస్ చెప్పాలని కోరాడు. సదరు ప్రధానోపాధ్యాయుడు ఆస్పత్రి చిరునామా తనకు తెలియదని చెప్పగా, దినేష్ సింగ్ గొడవకు దిగాడు. తన జేబులో ఉన్న బ్లేడుతో గన్ను గొంతుపై దాడి చేయడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ప్రథమ చికిత్స అందించి బాధితుడిని ఉట్నూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నెలాఖరుకల్లా వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



నవతెలంగాణ-జైపూర్

మార్చి 31 నాటికి గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి పన్ను వసూలు 100 శాతం పూర్తి చేయాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు సూచించారు. మొబైల్ యాప్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా సోమవారం రామారావుపేట్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసూలు చేసిన ఇంటి పన్ను నగదును గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కల పెంపకం పరిశీలించారు. వంద శాతం మొక్కల జన్మరేషన్ ఉండాలని తెలిపారు. సెగ్రిగేషన్ షెడ్డులో ఎప్పటికప్పుడు ప్లాస్టిక్ వేరు చేయాలని, తడి పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని తెలిపారు. స్థానికంగా తయారు చేసిన సేంద్రియ ఎరువును నర్సరీ మొక్కలకు వినియోగించగా మిగిలినది రైతుకు విక్రయించాలని తెలిపారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులు పరిశీలించి క్యూరింగ్ చేస్తుండాలని పంచాయతీ కార్యదర్శి రజితను ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించి, రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలని తెలిపారు.

నీటి ఎద్దడి నివారించాలని వినతి

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలో నీటి ఎద్దడి నివారించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్, ఈఓ అంజయ్యకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో వారం రోజుల నుండి నీటి ఎద్దడిని ఉన్నందున చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఇంటికి నీరు అందించే ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనికి ఎంపీడీవో సానుకూలంగా స్పందించి నీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారని గ్రామస్తులు వెంకటేష్ తదితరులు పేర్కొన్నారు.

నేటి దివ్యాంగ మహిళా దినోత్సవం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగ మహిళా దినోత్సవాన్ని మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు నగేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా దివ్యాంగ మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో మహిళలకు రక్షణ కరువవుతోందన్నారు. వారి భద్రత ప్రమాదంలో ఉందన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ అవి పకడ్బందీగా అమలు కాకపోవడంతోనే రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయన్నారు. కొత్త చట్టాలను తీసుకొచ్చి పకడ్బందీగా అమలు చేసినప్పుడే మహిళలు స్వేచ్ఛగా ఉండగలుగుతారన్నారు. సమావేశంలో జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరిఫా, సభ్యులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద మద్యం పట్టివేత

నవతెలంగాణ-బోథ్



సొనాల మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులో ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా మోటార్ సైకిల్‌పై మద్యం బాటిళ్లు తీసుకొస్తున్న బజార్‌హత్నూర్ మండలం దేగామ గ్రామానికి చెందిన చెవ్వ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ.8,400 ఉంటుందన్నారు. మద్యంతో పాటు మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హక్కుల సాధనకు కృషి చేస్తాం

నవతెలంగాణ-నస్పూర్



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

ట్రీట్మెంట్స్‌లో మెరుగైన హక్కుల సాధనకై కృషి చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ట్రేడ్స్ మేన్స్ శ్రీరాంపూర్ బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశానికి హాజరై మాట్లాడారు. ట్రేడ్స్ మెన్స్ సోదరులకు మెరుగైన హక్కులు సాధించడానికి ఏఐటీయూసీ కృషి చేస్తుందని, ట్రేడ్స్ మేన్స్ అనుభవిస్తున్న హక్కులను ఏఐటీయూసీ సాధించి పెట్టినవేనని అన్నారు. అదేవిధంగా ట్రేడ్స్ మెన్స్ సోదరులు మెడికల్ అన్ ఫీట్ అయితే సూటబుల్ జాబ్ ఇవ్వాలని, ట్రేడ్ మెన్స్ సోదరులకు పర్మినెంట్ హెల్పర్ను కేటాయించాలని, ఏరియా ఫిక్సేషన్ చేయాలని, మెరుగైన చార్జ్ అలవెన్స్, డిసిగ్నేషన్ మార్పు కొరకు యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ట్రేడ్స్ మెన్స్ సబ్ కమిటీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శిలు మురళీ చౌదరి, సంఘం సదానందం, మారుపెల్లి సారయ్య పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను విన్న తరువాత వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. కాగా ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 64 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా అధికారులు వాటిని పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి అధికారులకు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి...

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ మదర్సా కట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని హిందూ వాహిని జిల్లా శాఖ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి విన్నవించారు. తాటిగూడ కాలనీలోని వార్డ్ నెం.23లో ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా దారుల్ ఉలుమ్ మదర్సా అర్ధరాత్రి సమయంలో కట్టుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలం ప్రక్కనే నాల ఉన్నదని నాలకు సంబంధించిన స్థలాన్ని కబ్జా చేసి దారుల్ ఉలుమ్ మదార్సా కట్టుచున్న వ్యక్తుల పై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రాళ్లబండి మహేందర్, గంద్రత్ మహేందర్, కందుల చాణక్య, ఎల్చల నవనీత్ ఉన్నారు.



ప్రజావాణిలో డీడబ్ల్యూఓకు స్వల్ప అస్వస్థత...

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి హాజరైన డీడబ్ల్యూఓ సబిత ఉన్నట్టుండి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఒక్కసారిగా చెమటలు పట్టి నోటిమాట రాకపోవడంతో అందరూ హైరానా పడ్డారు. అక్కడే ఉన్న అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఉపాధి కల్పన అధికారి మిల్కా ఆమెను పరామర్శించి, కుటుంబీకులతో మాట్లాడగా రోజువారీ మాత్రలు వేసుకోకపోవడం వలన అలా జరిగి ఉంటుందని చెప్పుకొచ్చారు. అప్పటికే ఆమె తేరుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అడిషనల్ కలెక్టర్ సూచనతో విశ్రాంతి నిమిత్తం ఆమెను ఇంటికి పంపించారు.

బౌద్ధం ప్రపంచ శాంతి మార్గం

నవతెలంగాణ-వాంకిడి



బౌద్ధం ఒక మతం కాదని ప్రపంచ శాంతికి మార్గమని ఆల్ ఇండియా బిక్కు సంఘం ప్రధాన కార్యదర్శి నాగపూర్ భద్దంతే భంతే ధమ్మా సారధి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో నిర్వహించిన బౌద్ధ ధమ్మ దీక్షా శ్రామినేర్ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రబోధించారు. బుద్ధుడు చూపిన శాంతి మార్గం నేడు ప్రపంచమంతా ఆచరిస్తున్నారన్నారు. ప్రజ్ఞా, శీలం, కరుణ అనే అంశాలపైనే మనిషి జీవన శైలి ఆధారపడి ఉంటుందని సూచించారు. అదేవిధంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1956 ఏప్రిల్ 14న నాగపూర్ పట్టణ కేంద్రంగా లక్షల మందికి బౌద్ధ ధమ్మ దీక్ష ఇచ్చారని, దానినే మనం ఆచరించాలని అన్నారు. బౌద్ధం అంటే మూఢనమ్మ కాలను విడనాడడమేనన్నారు. అనంతరం భంతే రాహుల్ బుద్ధ వందన, పంచ శీలాన్నిదశ శిలాలను, దహ పరమేత బుద్ధ పూజ నిర్వహించారు. అంతకు ముందు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులోనాగపూర్ పట్టణానికి చెందిన భంతే వివేక్, భంతే రాహుల్ భోధి, భంతే నిబ్బాన్, బారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కార్,ఉపాధ్యక్షులు,వినీష్ ఉగ్రే,కోశాధికారి దుర్గం తిరుపతి,మండల భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షులు జయరాం, అంబేద్కర్ సంఘం నాయకులు దుర్గం సునీల్, కుమార్, ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్,బౌద్ధ సంఘం నాయకులు విలాస్ ,రాజేంద్ర ప్రసాద్, అరుణ్, రోషన్, విజయ్, విఠల్, బలవంత్, ఇంద్రజిత్, మనోజ్, శివాజీ, జైపాల్, చంద్రమణి, శ్యామ్ రావు దొండుజి, బాలు, దుర్గం ప్రశాంత్, జాడే ప్రశాంత్, మహిళ మండలి సభ్యులకు పాల్గొన్నారు.

పెండ్లి బారాత్‌లో గొడవ.. కత్తితో హత్యాయత్నం



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

పెళ్లి భారత్‌లో గొడవ హత్యాయత్నానికి దారితీసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం రూరల్ మండలం రత్నాపూర్ కాండ్లి తాండ గ్రామంలో ఆదివారం పెళ్లి భరాత్‌లో మలవాత్ రాజు, సులిగేల శ్రీకర్ డ్యాన్స్ చేస్తుండగా ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. గ్రామస్తులు నచ్చ చెప్పడంతో తోపులాట సద్దుమనిగింది. రాత్రి ఒంటి గంటకు భరాత్ అయి పోవడం శ్రీకర్, అతని స్నేహితులు కలసి మోటార్ సైకిల్ మీద వారి ఇంటికి వెళు తున్నారు. ఈ క్రమంలో రాజు వారి మోటార్ సైకిల్ అడ్డంగా వెళ్లి శ్రీకర్‌ను తన జేబులో ఉన్న పొడవగా, అతని కుడి వైపు కన్ను దగ్గర కత్తి దిగింది. దీంతో అతని స్నేహితులు శ్రీకర్‌ను మోటార్ సైకిల్ పై నిర్మల్ ప్రభుత్వ హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్సా కోసం నిజామాబాద్ హాస్పిటల్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నేరస్తుడిని రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వడ్తల్‌లో దొంగతనం



నవతెలంగాణ-ముధోల్

వేసి ఉన్న తాళాలు పగలగొట్టి ఇంట్లోని విలువైన నగలు దోచుకెళ్లిన సంఘటన మండలంలోని వడ్తల్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం వడ్తల్ గ్రామానికి చెందిన దుడ్డు గంగన్న ఈనెల 1న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి అష్టా గ్రామంలోని తమ బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చి చూసు సరికి ఇంటి తాళం పగులకొట్టి ఉండి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోంచి బంగారం, వెండితో పాటు నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎస్సై సంజీవ్ సిబ్బందితో చేరుకుని సంఘటన పరిశీలించారు. ఈ ఘటనలో నాలుగు తులాల బంగారం ఆభరణాలు, పది తులాల వెండి, రూ.17వేల నగదు చోరికి గురైనట్లు బాధితుల పిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రానికి చెందిన మున్నూరుకాపు సంఘం ముధోల్ తాలూకా అధ్యక్షులు రోళ్ల రమేష్ తల్లి అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ధర్మగౌడ్, దిగంబర్, అజీజ్, శంకర్ ఉన్నారు.